కీసరలో రావ్ స్టూడియో ప్రారంభం



రావ్‌స్టూడియోను ప్రారంభిస్తున్న సీఐ వెంకటయ్య తదితరులు

కీసర: కీసరలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన రావ్‌స్టూడియోను కీసర సీఐ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ రమేశ్‌గుప్తా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీసర ప్రాంతంలో అన్ని వసతులతో కూడిన స్టూడియో ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు సుచిత్ర వెల్ఫేర్ అసోషియేషన్ కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో కాలనీ అధ్యక్షుడు చుక్కల నాగరాజు, ప్రధాన కార్యదర్శి జి.కుమార్, ఉపాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, రాంప్రసాద్, కోశాధికారి వీరసర్వర్‌కార్‌యాదవ్, చీఫ్ అడ్వైజర్ హరినారాయణరెడ్డి, జి.నరేశ్, సెక్రటరీ, లక్ష్మణ్‌రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశం ముదిరాజ్‌కు సత్కారం



మేడ్చల్‌రూరల్: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిషర్స్ కో ఆపరేటివ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన చినంగి వెంకటేశం ముదిరాజ్‌ను గుండ్ల పోచంపల్లి మున్సిపల్ నాయకులు ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, కౌన్సిలర్ మల్లిఖార్జున్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాండు ముదిరాజ్, రమేష్, ఆంజనేయులు, కృష్ణ, వెంకటేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఘట్‌కేసర్: ముస్లింలు బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి సూచించారు. కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్‌తో కలిసి బైపాస్ రోడ్డు సమీపంలోని శివారెడ్డిగూడ ఈద్గా, జామా మసీదు, మహ్మదీయ మసీదులో ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో కుతుబుద్దీన్, అజీజ్, అన్వూ, షకీల్, అయూబ్, ఖలీల్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం అందజేత

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధి భరత్‌నగర్‌లోని పురాతన మహంకాళి అమ్మవారి దేవాలయం పునర్ నిర్మాణానికి మౌలాలి కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ ఆదివారం రూ.50 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మొదటి విడత గతంలోనే రూ. 77 వేలను అందజేసినట్లు తెలిపారు. ఆలయ పునర్ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు.

సర్కారు సేవలు అంతంతే..!

- ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యల తిష్ట
- సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, బస్తీ, పల్లె దవాఖానాల్లో వైద్యులు, సిబ్బంది కొరత
- ఉన్నవారిపై అదనపు భారంతో సతమతం
- సౌకర్యాలు కరువు.. పట్టని పర్యవేక్షణ
- సమయపాలన పాటించకపోవడంతో రోగుల కష్టాలు
- ప్రైవేట్ ఆసుపత్రుల వైపు పరుగు

సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని సర్కారు దవాఖానల్లో సమస్యలు తిష్ట వేశాయి. 'అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న ట్లు'గా జిల్లాలో సంఖ్యాపరంగా ప్రభుత్వాసుపత్రులు ఉన్నా.. వైద్యులు, సిబ్బంది, సబ్ స్టాఫ్ పోస్టుల సిబ్బంది కొరతతో పాటు సరైన పర్యవేక్షణ లేక రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు పరిగెత్తాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానాల్లోనూ కనిపిస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా ఘట్‌కేసర్ కమ్యూనిటీహెల్త్ సెంటర్ ద్వారా రోగులు అంతంతమాత్రంగానే సేవలు పొందుతున్నారు. అలాగే 26 ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె, 112 బస్తీ దవాఖానాలు కూడా ప్రజలకు అరకొర సేవలు అందిస్తున్నాయి. దాదాపు ఏడాది కిందట మేడ్చల్, శామీర్‌పేట ఆసుపత్రులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ ఇప్పటివరకు సరిపడా వసతులు, సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడం మరోవైపు బెడ్లు లేకపోవటంతో పూర్తి స్థాయిలో రోగులకు సేవలు అందించలేకపోతున్నాయి.



మంజూరు పోస్టులకు దిక్కేది..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పెరిగిన జనాభా, కాలనీలకు అనుగుణంగా ఆసుపత్రులకు మంజూరు చేసిన పోస్టుల భర్తీ చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం పని చేస్తున్న డాక్టర్లు, వైద్యాధికారులు, సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఖాళీగా ఉన్న 35 మంది డాక్టర్లతో సహా 113 పారా మెడికల్, 32 ల్యాబ్ టెక్నీషియన్లు, 109 సబ్ స్టాఫ్ , 130 నర్సుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. జిల్లాలో 3 వేల మంది ఆశవర్కర్స్ పని చేయాల్సి ఉండగా 340 మంది మాత్రమే ఉన్నారు. అలాగే అప్‌గ్రేడ్ చేసిన మేడ్చల్, శామీర్‌పేట సీహెచ్‌సీల్లో 20 మంది వైద్యులు, 24 మంది స్టాఫ్ నర్సులు, 10 పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంది.

పర్యవేక్షణ లేక..నిర్లక్ష్యం

జిల్లాలోని పలు గ్రామీణ, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పర్యవేక్షణ కొరవడడంతో డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించకపోవడంతో రోగులు వైద్య పరీక్షలు, ఇతర సేవల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. సాధారణ జబ్బులు, జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులకు సంబంధించిన మందులు అడపాదడపా లభించినప్పటికీ, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

24 గంటల ఆసుపత్రుల్లోనూ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 24 గంటలు (రౌండ్‌ది క్లాక్) ఆసుపత్రులు 12 ఉండగా, ఇందులో నాలుగు ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, మరికొన్నింటిలో ఆలస్యంగా వారు రావడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రులకు వచ్చినా మందులు లేకపోవడంతో రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేవలు అంతంతే..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొందరు డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రోగులకు వైద్యం అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. మల్కాజిగిరి, ఘట్‌కేసర్, శామీర్‌పేట, మేడ్చల్ ఆసుపత్రులతో పాటు పీహె చ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు సహా పల్లె , బస్తీ దవాఖానాల్లో కూడా సమయ పాలన పాటించకపోవడంతో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు 12 ఉండగా ఇందులో 11 కేంద్రాల్లో ప్రసవాలు చేస్తున్నప్పటికీ డాక్టర్లు అందుబాటులో లేని కారణంగా గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే 26 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఇందులో ఆరింటిలో ప్రసవాలు చేస్తున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. జిల్లా వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణ సరిగా లేకపోవటంతోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ ఆసుపత్రులు , పీహెచ్‌సీలు, పల్లె, బస్తీ దవాఖానాల్లో ఖాళీలు భర్తీ చేసి సౌకర్యాలు కల్పించి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే రిజర్వేషన్లు



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న, అర్జున్, కృష్ణగౌడ్

ఘట్‌కేసర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే బడుగు, బలహీన, సబ్బండ వర్గాల వారికి రిజర్వేషన్లు లభించాయని ఘనాపూర్ మాజీ ఉప సర్పంచ్ అర్జున్, మాజీ వార్డు సభ్యులు కృష్ణగౌడ్, మహేశ్వర్‌గౌడ్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం సాధించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని, అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో దాసు, రాందాసు, సత్యం, అంజయ్య, మహిపాల్, జగదీశ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషిచేయాలి



కీసరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

కీసర: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని గోధుమకుంట గ్రామ కార్యదర్శి సురేశ్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో కీసర చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, గోధుమకుంట ఎంపీటీసీ మంచాల కిరణ్‌జ్యోతీప్రవీణ్, నవీన్, వేణుగోపాల్, శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



కీసర: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ మరింత సులభం అవుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గోధుమకుంట గ్రామంలో మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి సొంత ఖర్చులతో గ్రామపరిధిలోని చంద్రకాలనీలో సుమారు రూ. లక్ష వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో పాటు, పిల్లలు ఆడుకునే ఆట వస్తువులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంచాల కిరణ్‌జ్యోతీప్రవీణ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తదితరులు

హితంలో ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్



కార్యక్రమంలో పాల్గొన్న పలు కళాశాలల ప్రతినిధులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి జ్ఞానాపూర్‌లోని హితం కళాశాలలో ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీ హబ్ సీఈఓ శ్రీనివాస్ మహంకాళిరావు మాట్లాడుతూ విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారేలా కృషి చేయాలన్నారు. మెంటర్–మెంటీ కార్యక్రమంలో భాగంగా పలు కళాశాలలు పాల్గొన్నాయి. అనంతరం పలువురు ప్రతినిధులు కవితారాజేశ్, శ్రీనివాస్ మద్దిపాటి, గౌరవ్ గుప్తాలు స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌లపై చర్చించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరవింద్, రిజిస్ట్రార్ కల్నల్ సుబ్రమణ్యం, అసిస్టెంట్ డీన్ సతీశ్‌రెడ్డి, కో ఆర్డినేటర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కుషాయిగూడ: సేవాభావంతో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. ఆదివారం హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో జీనియా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్‌తో పాటుగా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు చేయడంతో పాటుగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



బాబాజాన్ (ఫైల్)

పోచారం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పీఎస్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బొక్కొనిగూడ గ్రామానికి చెందిన ఎండీ బాబాజాన్ (45) జీడిమెట్లలోని అంజనీ కెమికల్ ఫ్యాక్టరీలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి పోచారం మున్సిపాలిటీ అన్నోజీగూడ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా ఉప్పల్ వైపు నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అతడు రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భద్రత, భరోసాకు మారుపేరే 'నాన్న'

రామంతాపూర్: భద్రత, భరోసాకు మారుపేరే నాన్న అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సాయి కృష్ణ కాలనీలో వంశరాజ్ సంక్షేమ సంఘం అమ్మానాన్న జ్ఞాన మందిరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఫాదర్స్ డేకు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి, ఈటల రాజేందర్ సతీమణి ఈటల జామున హాజరై ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన వంశరాజ్ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కుటుంబభారం మోస్తూ కష్టాలను కడుపులో దాచుకుని తన పిల్లలకు భరోసా భద్రత కల్పిస్తూ వారి భవిష్యత్తు బంగారంలా మారాలని తన సర్వస్వాన్ని త్యాగం చేసేది ఒక్క నాన్నేనని అన్నారు. అనంతరం కార్పొరేటర్ శ్రీవాణి, ఈటల జమునలు మాట్లాడుతూ మొదటి గురువు, మార్గదర్శి అన్ని నాన్నే అని పిల్లలు కేవలం పాదర్స్ డే, మదర్స్ డే రోజు మాత్రమే తల్లిదండ్రులను గౌరవించడం కాకుండా ఇతర అన్ని రోజుల్లో కూడా వారిని గౌరవించాలని సూచించారు. జీవన్ కుమార్, సాయి కిరణ్, కృష్ణయ్య వంశరాజ్, ,గోపాల్, బాలస్వామి వంశరాజ్, చిన్న కృష్ణ వంశరాజ్, వెంకటయ్య వంశరాజ్, అమ్మనాన్న ఫౌండేషన్ చైర్మన్ తిరుపతయ్య వంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల కోసం మరిన్ని సేవలు



కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్

కాప్రా: ప్రయాణికుల సౌకర్యార్థం కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో మరిన్ని సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చామని డిపో మేనేజర్ చంద్రకాంత్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళవారం నుంచి 117 ఎం నూతన బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నాచారం పారిశ్రామికవాడలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది, ఇతర కార్మికుల కోసం రవాణా సేవలు అందించేందుకు ఈ 117 ఎం సర్వీసును అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి మల్లాపూర్, మానిక్‌చంద్ పోస్టాఫీస్ మీదుగా ఉప్పల్ చేరుకుంటుదన్నారు. ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి ప్రతి రోజూ ఉదయం 6.10 గంటలకు ప్రారంభమై ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని చెప్పారు.

మేడ్చల్ కలెక్టరేట్‌కు బస్సు సౌకర్యం...

ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చంద్రకాంత్ తెలిపారు. ఈ రూట్‌లో ఇప్పటికే 242 డీఎం బస్సు నడుస్తుందని దీనికి అదనపు మరోరెండు ట్రిప్పులు వేస్తున్నట్లు తెలిపారు. ఈ 242 డీఎం బస్సు ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి బండ్లగూడ, కీసర, యాధార్‌పల్లి ఎక్స్‌రోడ్, తిమ్మాయిపల్లి మీదుగా మేడ్చల్ కలెక్టరేట్ చేరుకుని దొంగల మైసమ్మ వరకు వెళ్లనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నడుస్తున్న ట్రిప్పుల కంటే అదనంగా మధ్యాహ్నం ఒంటిగంటకు, 3 గంటలకు ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి అందుబాటులో ఉంటుందన్నారు. తిరుగు ప్రయాణం సాయంత్రం 6 గంటలకు, రాత్రి 8 గంటలకు కలెక్టరేట్ నుంచి తిరుగు ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన వివరించారు. కుషాయిగూడ బస్ డిపో ద్వారా ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ చంద్రకాంత్ కోరారు.

వ్యాస పూర్ణిమ విష్ణు సహస్ర పారాయణం

రామంతాపూర్: వ్యాస పూర్ణిమ సందర్భంగా ఈనెల 21న లోక కల్యాణం కోసం 500 మందితో అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతుందని ఈ కార్యక్రమానికి కులమత భేదాలు లేకుండా అందరూ పాల్గొనవచ్చునని నిర్వాహకులు శాస్త్రుల రఘురామ శర్మ తెలిపారు. ఆసక్తి గల వారు 9440240881 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

ప్రజలకు చేరువ కావాలి

కుషాయిగూడ: గత మూడు నాలుగు నెలలుగా ఎన్నికల ప్రచారాల్లో బిజీగా ఉన్న నాయకులు, కార్యకర్తలంతా ఇకముందు ప్రజలకు చేరువ కావాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జలగం వెంకటేష్ సూచించారు. ఆదివారం హెచ్‌బీకాలనీ, రాజీవ్‌పార్కులో కాంగ్రెస్ పార్టీ మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే వార్డు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటం లేకపోవడంపై సమావేశంలో చర్చించారు. రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న అవకతవకలపై కూడా దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్‌గౌడ్, సురేష్, మల్లికార్జున్, అనిల్, సమ్మయ్య, కాంతారావు, నిర్మల పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మేడ్చల్ ఆర్టీసీ బస్టాండ్..!

- రాత్రుల్లో మందుబాబులు, గంజా బ్యాచ్ హల్‌చల్
- బస్టాండ్‌కు రావాలంటేనే జంకుతున్న మహిళలు, విద్యార్థినులు

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. రాత్రి సమయాల్లో ఓ వైపు అసాంఘిక కార్యకలపాలు, మరో వైపు గంజా బ్యాచ్, మందుబాబులు హల్‌చల్ చేస్తుండడంతో ప్రయాణికులు, మహిళలు, విద్యార్థినులు బస్టాండ్‌కు రావాలంటేనే జంకుతున్నారు.

సువిశాల ఆవరణలో ప్రయాణ ప్రాంగణం..

మేడ్చల్ బస్టాండ్ సువిశాల ఆవరణలో ఉంది. ఓ వైపు డిపో ఉండగా, మధ్యలో ప్రయాణ ప్రాంగణాన్ని నిర్మించారు. నిత్యం ఇక్కడి నుంచి వందల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

బస్‌స్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారైంది. ఆవరణను ఆనుకుని ఉన్న ఓ లాడ్జిలో గంటల సమయం చొప్పున గదులు అద్దెకు ఇస్తున్నారని దీంతో పదుల సంఖ్యలో మహిళలు బస్ స్టేషన్ ఆవరణలో కస్టమర్లకు వల వేసి ప క్కనే ఉన్న లాడ్జిలకు వెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు..

తమ జీవనం సాగించేందుకు పడుపు వృత్తి చేస్తున్న కొంతమంది మహిళలతో బస్‌స్టేషన్‌కు వచ్చే మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విటులు కనబడుతున్న మహిళలను అటకాయిస్తుండడంతో వీరి ఆగడాలు భరించలేక చాలా మంది చాలామంది మహిళలు, విద్యార్థినులు బస్ స్టేషన్‌కు వెళ్లడం మానేసి ప్రధాన గేట్ వద్దే బస్సుల కోసం వేచి ఉంటున్నారు.



గంజా బ్యాచ్ హల్‌చల్..

బస్టాండ్‌లో గంజాయి బ్యాచ్‌తో మరోరకం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యువకులు బస్‌స్టేషన్ ఆవరణలో జాతీయ రహదారి పక్కనున్న రోడ్డుపై కూర్చుని గంజాయి పీలుస్తున్నారు. బైక్‌లపై బస్టాండ్ ఆవరణకు వచ్చి విద్యార్థినులను ఈవ్‌టీజింగ్ చేస్తున్నారు.

రాత్రయితే తాగుబోతులు..

బస్‌స్టేషన్ రోడ్డులో రాత్రి అయితే మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఆవరణ ఎక్కువగా చీకటిమయంగా ఉండడంతో చెట్ల మాటున, కార్లు, ఇతర వాహనాలను పార్క్ చేస్తూ అందులోనే మద్యం తాగుతున్నారు.

కరువైన నిఘా..

అసాంఘిక కార్యకలపాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బందితో పాటు, పోలీసులదే. అయితే పోలీసుల నిఘా తక్కువ కావడం, ఆర్టీసీ సిబ్బంది పెద్దగా పట్టించుకోకపోవడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారి పక్కన నిత్యం వేలామంది సంచరించే ప్రాంతాల్లో చట్టవ్యతిరేక పనులు జరుగుతుండడంతో మహిళలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేడ్చల్ డిపో ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు అధికమయ్యాయని పలుమార్లు డిపో అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, నిఘా పెంచి ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ప్రయాణికులు కోరుతున్నారు.